సాక్షి
నంద్యాల
మంగళవారం । 18 । జూన్ । 2024



సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద గుంటూరు అను అకాడమీ కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది.



రూ. 2లక్షల విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస రెడ్డి రూ.1,00,116 , గుంటూరుకు చెందిన ఓ. ఓబుల్ రెడ్డి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

మారుతున్న చట్టాలపై అవగాహన అవసరం



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో జూలై 1 నుంచి కొత్తగా అమలవుతున్న భారత న్యాయ సంహిత బీఎన్ఎస్‌పై పోలీసులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాల గురించిన సెక్షన్ల వివరాలు ఒక చార్ట్ రూపంలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఎస్బీ డీఎస్పీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

20న కేంద్ర బృందం పర్యటన

- నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం

నంద్యాల: జిల్లాలో ఈనెల 20వ తేదీన కేంద్ర కరువు బృందం పర్యటించనున్నదని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నేపథ్యంలో కరువుకు సంబంధించి 12 మండలాల్లో జరిగిన నష్టాన్ని స్పష్టంగా, అర్థమయ్యే రీతిలో వివరించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.గత రబీలో 12 మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ టీం ఈనెల 20 తేదీ జిల్లాకు వస్తుందన్నారు. ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాల్లో పర్యటిస్తుందని చెప్పారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి మండలానికి నాలుగైదు ఫొటోలతో పాటు నివేదికలు కూడా సిద్ధం చేయాలన్నారు. పశుగ్రాస కొరతపై పశుసంవర్ధక శాఖ, కూలీలకు కల్పించిన పనులపై డ్వామా, గ్రామాలలో నీటి సరఫరాపై గ్రామీణ నీటి సరఫరా, రబీలో సాగుకు సాగునీటి వివరాలపై ఇరిగేషన్, భూగర్భ జల శాఖలకు సంబంధించిన అధికారులు నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కరువుకు సంబంధించిన స్పష్టమైన ఫొటోలను ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించాలన్నారు. రైతులతో జరిపే ముఖాముఖి, కేంద్రబృందం రూట్ మ్యాప్.. తదితర అంశాలపై నివేదికలు తయారుచేసి మంగళవారం ఉదయం జరిగే సమావేశానికి తీసుకురావాలన్నారు. లైజన్ అధికారులు కూడా కరువు పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలాన్నరు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ పద్మజ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి 3,065 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి సుంకేసుల నుంచి 3,065 క్యూసెక్కుల వరదప్రవాహం వస్తోంది. ప్రస్తుతం జలాశయంలో 36.1392 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 813.10 అడుగులకు చేరుకుంది.

తెరచుకోని 'మోడల్' హాస్టల్



జూపాడుబంగ్లా: స్థానిక మోడల్ పాఠశాల హాస్టల్ తెరుచుకోలేదు. దీంతో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న దూరప్రాంతాల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై ఐదు రోజులు కావొస్తున్నా హాస్టల్ ప్రారంభించలేదు. విద్యార్థినులు బస్సులు, ఆటోల్లో రావాల్సి వస్తోంది. మోడల్‌పాఠశాల హాస్టల్లో 9 , 10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు వసతి సౌకర్యం ఉంది. పాములపాడు, కొత్తపల్లి, మిడ్తూరు, పగిడ్యాల, నందికొట్కూరు మండలాలకు చెందిన విద్యార్థినులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. హాస్టల్ ప్రారంభించకపోవటంతో వీరంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ హాస్టల్‌కు అవసరమైన సరుకులు ఇంకా కేటాయింపు కాలేదన్నారు. విద్యార్థినులకు అన్నం వండిపెట్టేందుకు అవసరమైన సరుకులు లేని కారణంగా హాస్టల్‌ను ప్రారంభించలేదని స్పష్టం చేశారు.

'పచ్చని' లక్ష్యం!

పండ్ల తోటల అభివృద్ధికి శ్రీకారం

- ఉపాధి హామీ పథకం కింద వంద శాతం సబ్సిడీ
- పచ్చదనం అభివృద్ధికి విరివిగా మొక్కల పెంపకం
- ఎన్నికల కోడ్ ముగియడంతో పరిపాలన అనుమతులపై దృష్టి
- 13,700 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి లక్ష్యం
- ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు అవకాశం



అభివృద్ధి చెందిన పండ్లతోట

కర్నూలు(అగ్రికల్చర్): పండ్లతోటల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపునకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. రెండు జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నెల 5 నాటికి ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకునేందుకు శ్రీకారం చుట్టారు. రెండు జిల్లాల్లో కలెక్టర్ల నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన వెంటనే గుంతలు తవ్వించడం, మొక్కలు నాటే పనులు చేపట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో ఎపుడూ లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగించింది. ఇందుకు ప్రధాన కారణం పచ్చదనం లేకపోవడమే. ఇదే పరిస్థితి నెలకొంటే వచ్చే ఏడాది ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే 2024-25 సంవత్సరంలో జిల్లా నీటియామజమాన్య సంస్థ పండ్లతోటల అభివృద్ధితో పాటు కెనాల్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అటవీ శాఖ కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది.

వంద శాతం సబ్సిడీ

కరువు ప్రాంతాలలో పండ్లతోటలను అభివృద్ధి చేసుకుంటే కరువును తరిమి కొట్టినట్లే. 2019-20 నుంచి 2023-24 వరకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పండ్లతోటల అభివృద్ధిని విశేషంగా ప్రోత్సహించింది. ఫలితంగా ఐదేళ్ల కాలంలో 19,249 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి కావడం విశేషం. ఈ కారణంగా పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. 2024-25 సంవత్సరంలోనూ గ్రామీణాభివృద్ధి శాఖ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు ఐదు ఎకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు సన్న, చిన్నకారు రైతులు కూడా అర్హులే. ఉపాధి హామీ జాబ్‌కార్డుతో పాటు భూమికి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉంటే పండ్లతోటల సాగుకు వంద శాతం సబ్సిడీ లభిస్తుంది.

అన్ని రకాల తోటల అభివృద్ధికి అవకాశం

ఉపాధి హామీ కింద అన్ని రకాల పండ్లతోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. 100 శాతం సబ్సిడీతో గులాబీ, మల్లెతో సహా 17 రకాల పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. ఎక్కువగా దీర్ఘకాలిక పండ్లతోటల సాగును ప్రోత్సహిస్తారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్(రేగు), డ్రాగన్‌ఫ్రూట్స్, అంజూర, పూలతోటలకు సంబంధించి గులాబీ, మల్లె తోటలు అభివృద్ధి చేసుకోవచ్చు. రెండు, మూడేళ్లగా మునగకు అవకాశం లభించింది. మునగ, మల్లె, గులాబీ, ఆపిల్‌బేర్ పండ్లతోటలకు మెయిన్‌టెనెన్స్ బిల్లులు రెండేళ్లు.. మిగిలిన పంటలకు మూడేళ్లపాటు బిల్లులు చెల్లిస్తారు.

లక్ష్యం 13,700 ఎకరాలు

వచ్చే సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 13,700 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. కర్నూలు జిల్లాలో 7,400 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 6,300 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే పండ్లతోటల అభివృద్ధిపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 3,600 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 3,000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసుకునేందుకు రైతులను గుర్తించారు.

నీటి వసతి లేక పోయినా అవకాశం

- గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పండ్లతోటల అభివృద్ధికి నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు.
- మెట్టభూములు, చౌడు భూముల్లో కూడా పండ్లతోటలు అభివృద్ధి చేసుకోవచ్చు.
- రైతులు తమ పొలం పరిసరాల్లో చెరువు, లేదా కాలువ, డగౌటు పాండ్, ఇతర నీటి సదుపాయం ఉన్నా పండ్లతోటలకు అర్హులే.
- ఏదో విధంగా ఎండాకాలంలో మొక్కలను బతికించుకోవాలి. ఇందుకు ఉపాధి కింద నీటి బిల్లులు ఇస్తారు. దీనినే డ్రైల్యాండ్ హార్టికల్చర్‌గా వ్యవహరిస్తారు.
- డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మామిడి, నేరేడు, సీతాఫలం, చింత, రేగు(ఆపిల్‌బేర్), జామ, మునగ వంటి తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు.
- సాధారణంగా చౌడు నేలలను పనికి రాని నేలలుగా వ్యవహరిస్తారు.
- ఉపాధి కింద చౌడు నేలల్లోను సీతాఫలం, నేరేడు,జామ, సపోట వంటి మొక్కలు నాటుకోవచ్చు. అయితే సమీపంలో నీటి వసతి తప్పనిసరి. మిగిలిన తోటల అభివృద్ధికి బావి లేదా బోరు ఉండాలి.

పండ్లతోటల సాగులో ఎకరాకు మూడేళ్లలో చెల్లించే సబ్సిడీ

పండ్ల రకం	3/2 ఏళ్లకు చెల్లించే మొత్తం(రూ॥ల్లో)
మామిడి	99,911
చీని	1,26,702
నిమ్మ	1,33,911
జామ	1,35,288
థైవాన్	2,25,560
సపోటా	86,504
కొబ్బరి	88,193
సీతాఫలం	1,90,114
దానిమ్మ	1,96,019
ఆపిల్‌రేగు	1,14,329
డ్రాగన్‌ఫ్రూట్	1,86,638
గులాబీ	1,90,000
మల్లె	1,44,072
నేరేడు	61,793
చింత	60,999
మునగ	91,776
అంజూర	1,66,997

రైతులకు చక్కటి అవకాశం



పండ్లతోటల అభివృద్ధికి 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులు చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తాం. అసైన్డ్ భూములు, మెట్టభూములు కలిగిన రైతులకు పండ్లతోటలు మంజూరు చేస్తాం. అయితే పండ్ల మొక్కలను కాపాడుకునేందుకు నీటి సదుపాయం అందుబాటులో ఉండాలి. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 7,400 ఎకరాల్లో తోటలు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. ఇలాంటి చక్కటి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత ఎంపీడీఓ లేదా ఏపీఓను సంప్రదించవచ్చు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

భక్త జనసంద్రంగా శ్రీగిరి

- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- సర్వ దర్శనానికి 4గంటల సమయం



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. క్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలను తాత్కాలికంగా రద్దు చేశారు. సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2గంటల సమయం పట్టింది. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి.



నంద్యాల కుబ్రామసీదులో సందేశం ఇస్తున్న మతపెద్ద అంజాద్‌బాషా , ఎస్పార్బీసీ ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6గంటల నుంచే మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం అలైహిసలాం ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిసలాంలు చేసిన త్యాగాలు స్మరించుకున్నారు. ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం కుర్బానీ నిర్వహించారు. త్యాగ నిరతి చాటడం, స్వార్థం, అసూయలను విడిచిపెట్టి మానవతను పెంపొందిచడం.. బక్రీద్ పండుగ ఆంతర్యమని మతపెద్దలు తెలిపారు.

– నంద్యాల(వ్యవసాయం)

నేడు 'పీఎం కిసాన్' విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి రైతులకు 17వ విడత ఆర్థిక సహాయం అందనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. బటన్ నొక్కి రైతుల ఖాతాలకు 2024-25 సంవత్సరానికి మొదటి విడత పెట్టుబడి సాయం కింద రూ.2,000 చొప్పున విడుదల చేయనున్నారు. జిల్లాలో 2,96,973 మంది రైతులకు దాదాపు రూ.60 కోట్లు ప్రయోజనం లభించనుంది.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్యా మహా స్వామి దర్శించుకున్నారు. సోమవారం రాత్రి మల్లన్న దర్శనానికి ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి. పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామి వారికి అభిషేకం, భ్రమరాంబా దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం వేదగోష్టి నిర్వహించారు.

మల్లన్న చెంత వసతి సులభతరం

- ఆన్‌లైన్ ద్వారా భక్తులు వసతి గదులు పొందే అవకాశం
- పూర్తి పారదర్శకతతో కేటాయింపు
- దేవస్థానం నిర్ణయంపై భక్తుల హర్షం



భక్తులకు వసతి సౌకర్యం కల్పిస్తున్న గౌరీ సదనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర సందర్శనకు రోజురోజుకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉన్న వసతి గదులు తక్కువ, భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. క్షేత్రానికి చేరుకున్న భక్తులు వసతి పొందేందుకు గతంలో దళారులను ఆశ్రయించే వారు. సమస్యను గుర్తించిన దేవస్థానం భక్తులకు వసతి గదులు పొందేందుకు పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో వసతి గదులు అందుబాటులో ఉంచారు. దీంతో భక్తులే ఇంటి వద్ద నుంచి నేరుగా వారికి కావాల్సిన రోజు వసతి గది పొందే అవకాశం లభించింది. దేవస్థానం తీసుకున్న నిర్ణయం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైల క్షేత్రానికి సాధారణ రోజుల్లో 10 వేల నుంచి 20 వేల మంది భక్తులు, శని, ఆది, సోమవారాల్లో 20 వేల నుంచి 35 వేల మంది భక్తులు, వరుస ప్రభుత్వ సెలవు రోజుల్లో, ముఖ్యమైన పర్వదినాల్లో 40 వేల నుంచి 60 వేల మంది భక్తులు తరలివస్తున్నారు. రద్దీ రోజుల్లో, ముఖ్యమైన పర్వదినాల్లో భక్తులకు వసతి కష్టాలు తప్పడం లేదు. క్షేత్ర పరిధిలో ఉన్న వసతి గదుల కంటే రెండు రెట్లు అధికంగా భక్తుల రాక ఉండడంతో భక్తులకు వసతి కష్టతరంగా మారింది. అంతేకాకుండా ఇతర దేవస్థానాల మాదిరి కాకుండా శ్రీశైల యాత్రకు వచ్చే భక్తులు తప్పనిసరిగా వసతి సౌకర్యానికి దేవస్థానం మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి.



గణేశ సదనం

వసతి గదుల వివరాలు..

శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం తరుపున వీఐపీ కాటేజీలు 33, గంగా-గౌరీ సదన్‌లో 140, పాతాళేశ్వర సదన్‌లో 50, మల్లికార్జున సదన్‌లో 65, గణేశ సదన్‌లో 224, అంబా, కుమార సదన్‌లో 80, డార్మెంటరీలు 2, హాళ్లు(100 మంది వసతి పొందే) 10 ఉన్నాయి. దేవస్థానం వసతి గదుల్లో సుమారు 6 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. అలాగే క్షేత్ర పరిధిలో 55 కుల సంఘాల చెందిన అన్నతాన సత్రాలు ఉన్నాయి. అన్ని సత్రాలను కలుపుకుంటే సుమారు 4 వేల వసతి గదులు ఉంటాయి. సత్రాల ద్వారా 16 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. దేవస్థానం, సత్రాల వసతి గదులను కలుపుకుంటే సుమారు 22 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది.

దళారుల బారిన పడకుండా..

గతంలో భక్తులు వసతి కోసం దళారులను ఆశ్రయించేవారు. అయితే దేవస్థానం భక్తులకు వసతి గదులు సులభతరంగా పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దేవస్థాన పరిధిలో ఉన్న గంగా సదన్, గౌరి సదన్, మల్లికార్జున సదన్, పాతాళేశ్వర సదన్, గణేశ సదన్, వీఐపీ కాటేజీలు అన్నింటిని ఆన్‌లైన్ (www.srisailadevasthanam.org) ద్వారా వసతి గదులు పొందే అవకాశాన్ని కల్పించింది. భక్తులు నేరుగా తమ ఇంటి వద్ద నుంచే తమకు ఏ తేదీన వసతి గది కావాలో ఆ రోజే గది పొందేలా వెసులుబాటు కల్పించింది. దీంతో శ్రీశైలంలో ఎవరిని ఆశ్రయించకుండా భక్తులే నేరుగా వసతి గదులు పొందే అవకాశం వచ్చింది.

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోండి



మల్లన్న భక్తులు తమ ఇంటి వద్ద నుంచే స్వయంగా వారే వసతి గదులు బుక్ చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. శ్రీశైలం వచ్చి వసతి గదుల కోసం ఇబ్బందులు పడకుండా భక్తులు వారి క్షేత్ర యాత్ర ప్రణాళిక ప్రకారం వసతి, దర్శన టికెట్లను పొందేలా ఆన్‌లైన్ ఏర్పాటు చేశాం. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ శ్రీశైల యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరుతున్నాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

మరింత స్మార్ట్‌గా మతి మరుపు

- స్మార్ట్‌ఫోన్ అతి వాడకంతో మొద్దుబారుతున్న మెదడు
- చిన్న విషయాన్నీ మరిచిపోతున్న బాధితులు
- పెరుగుతున్న మతిమరుపు జబ్బు
- జిల్లాలో 10 శాతం దాకా బాధితులు
- మానసిక ఒత్తిడి, ఆందోళన కారణాలు





• కర్నూలుకు చెందిన ప్రశాంత్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అందులో అతనికి కంపెనీ తరుపున బయట తిరిగే పనే ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన పని, ఎవరిని కలవాలి, ఏ పని చేయాలనే విషయాలూ గుర్తుపెట్టుకుని మరీ ఎప్పటికప్పుడు చేసేసేవాడు. ఎవరి మొబైల్ నెంబర్ అడిగినా సెల్‌ఫోన్ చూడకుండానే ఠక్కుమని చెప్పేవాడు. అయితే ఇటీవల ప్రతి చిన్న విషయాన్నీ మరిచిపోతున్నాడు. ఇంటి ఫోన్ నెంబర్ అడిగినా సెల్‌ఫోన్ చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

• ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేష్ బీటెక్ పూర్తి చేశాడు. అతను చిన్నతనంలో దేశంలోని రాష్ట్రాల రాజధానులు, లెక్కలు వెంటనే చెప్పేవాడు. స్కూల్‌లో టీచర్ ఎంత క్లిష్టమైన సమస్య ఇచ్చినా ఠక్కున బోర్డుపై చేసేవాడని అతని స్నేహితులు ఇప్పటికీ చెప్పుకుంటారు. ప్రస్తుతం అతను ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. కాలానుగుణంగా స్మార్ట్ ఫోన్‌కు అలవాటు పడటంతో క్రమంగా అతని జ్ఞాపకశక్తి తగ్గిపోయింది. ప్రతి చిన్న విషయానికీ మొబైల్ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కర్నూలు(హాస్పిటల్): వాస్తవంగా ప్రతి మనిషికీ వయస్సు రీత్యా వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఎంతో కొంత మతిమరుపు వస్తుంది. కొందరికి ఇది శృతిమించుతుంది. దీనిని వైద్యపరిభాషలో అల్జీమర్స్ అంటారు. అయితే ఇటీవల కాలంలో యువతలోనూ మతిమరుపు సమస్య ఎక్కువైపోతోంది. నిత్యం చదువుపై ధ్యాసం ఉండటంతో పాటు ఉద్యోగంలో తీవ్ర మానసిక ఒత్తిడి, కుటుంబానికి సంబంధించిన ఆందోళన, భవిష్యత్‌పై దిగులు తదితర కారణాల వల్ల మెదడు ఒత్తిడికి గురై జ్ఞాపకశక్తి కూడా నశిస్తోంది. స్మార్ట్‌ఫోన్ సైతం మతిమరుపు సమస్యకు ఒక కారణంగా వైద్యులు పేర్కొంటున్నారు. జిల్లాలో మతిమరుపు సమస్యతో బాధపడే వారి సంఖ్య అధికమవుతున్నారు. గతంలో కేవలం వృద్ధాప్యంలో మాత్రమే ఈ సమస్య వచ్చేది. ఇప్పుడు పరిస్థితులకు అనుగుణంగా యువతలోనూ ఈ సమస్య అధికమవుతోంది. సాధారణంగా వృద్ధుల్లో మతిమరుపు సమస్య 20 నుంచి 25 శాతం వరకు ఉండగా 20 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న యువతలో 10 శాతం వరకు ఈ సమస్య ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా అల్జీమర్స్, డిమెన్షియా స్టేజిలో మాత్రమే మానసిక వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్తున్నారు. చిన్న చిన్న విషయాలు జ్ఞాపకంగా లేని కారణంగా వైద్యుల వద్దకు వెళ్లే వారు తక్కువేనని చెప్పొచ్చు. నగరంలోని మానసిక వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు, న్యూరాలజిస్టుల వద్దకు వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులను వైద్యులు వారికుండే వ్యాధి లక్షణాల గురించి ఆరా తీసినప్పుడు జ్ఞాపకశక్తి తగ్గిపోవడం కూడా ఒకటుందని తెలుస్తోంది.

మతి మరుపునకు కారణాలు ఎన్నో..

ఒకప్పుడు ఏదైనా పదానికి అర్థం తెలియాలంటే ఆయా భాషలకు సంబంధించి డిక్షనరీలను వెతికే వారు. లేదా అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులు లేదా విజ్ఞానులను అడిగి తెలుసుకునే వారు. కానీ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక ఏ పదానికైనా అర్థం కావాల్సి వస్తే వెంటనే గూగుల్ తెరిచి పదం టైప్ చేసి అర్థం వెతికేస్తున్నారు. దీనివల్ల ఇతరులతో మాట్లాడటం, మాటలు, విషయాలు పంచుకోవడం తగ్గిపోతోంది. దీంతో పాటు గణితంలో ఏదైనా ఒక సమస్య ఇస్తే పేపర్‌పై దానిని సాధన చేసి సమస్యకు పరిష్కారం దొరికేవరకు ప్రాక్టీస్ చేసేవారు. దీనివల్ల మెదడుకు చురుకుదనం లభించేది. కానీ ఇప్పుడు మొబైల్‌లోని కాలుక్యులేటర్‌లో టైప్ చేసి క్షణాల్లో లెక్క తేల్చేస్తున్నారు. దీనివల్ల మెదడు ఆలోచించి సమస్యను సాధించే శక్తిని కోల్పోతోంది.

- బస్సు/రైలు ఎక్కిన వెంటనే ప్రతి ఒక్కరూ వారి వ్యక్తిగత మొబైల్ చూస్తూ గడపటంలో బిజీగా మారుతున్నారు. మరికొందరు ఫోన్‌లో సంగీతం వింటూ ప్రయాణం చేస్తున్నారు. దీనివల్ల పక్కనున్న వారి గురించి, సమాజం గురించి, ఇతర ప్రాంతాల గురించి తెలుసుకోలేకపోతున్నారు.
- సాధారణంగా వివాహాది శుభకార్యాలకు వెళ్లినప్పుడు ఒకరికొకరు కలుస్తారు, యోగక్షేమాలు తెలుసుకోవచ్చు, తద్వారా బంధాలు బలపడతాయన్న కారణంతో ఎక్కువగా కలిసేవారు. ఇప్పుడు కూడా ఆయా శుభకార్యాలకు వస్తున్నారు కానీ వచ్చామా....హాజరు వేసుకున్నామా అన్నట్లు వ్యవహారం ఉంది. వచ్చిన కార్యం ఆలస్యం అయితే మాట వరుసకు పలకరించుకుని ఆ తర్వాత ఎవరికి మొబైల్‌లో వారు మునిగిపోతున్నారు. దీనివల్ల సామాజిక బంధాలు దూరమవుతున్నాయి. ఒకరి విషయాలు మరొకరికి తెలియడం లేదు.

జ్ఞాపకశక్తిని పెంచుకోవడం ఇలా...

- స్మార్ట్‌ఫోన్‌లు పక్కన పెట్టి పుస్తక పఠనం చేయాలి. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
- స్మార్ట్‌ఫోన్ వినియోగానికి పరిమిత/నిర్దీత సమయం మాత్రమే కేటాయించాలి. దానికి బానిస కాకూడదు
- నిత్యం మన కెరీర్ గోల్స్‌ను లక్ష్యంగా ఉంచుకోవాలి. ఇందుకోసం రోజు, వారం, నెలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- శారీరక వ్యాయామం, మంచి ఆలోచనలు, మంచి ఆహారపు అలవాట్లు, ఇతరలతో మమేకం కావడం, కబుర్లు చెప్పుకోవడం చేయాలి.
- మెదడుకు పనిచెప్పే చదరంగం, పజిల్స్ పూరించడం, సుడోకో, పదవిన్యాసం, పద వినోదం చేయాలి.
- తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లి రావడం వల్ల మెదడు ఉత్తేజితం అవుతుంది.
- గుండెజబ్బులు, బీపీ, షుగర్‌లను నియంత్రణలో ఉంచుకోవాలి
- మెరుగైన ఆలోచనలతో ఆతృత, ఆందోళన, కృంగుబాటు తగ్గించుకోవాలి. ఇందుకోసం యోగా, ధ్యానం చేయాలి.
- సంగీతం, నృత్యం, చిత్రలేఖనం అభిరుచిగా ఎంచుకోవాలి
- సంగీతం అభ్యసించడం రాకపోతే కనీసం మంచి మ్యూజిక్ వినడం మేలు

మతిమరుపు బాధితుల సంఖ్య పెరిగింది



ఇటీవల కాలంలో మతిమరుపు బాధితుల సంఖ్య బాగా పెరుగుతోంది. ప్రతి విషయానికి ఇంటర్‌నెట్‌పై ఆధారపడటంతో స్వతహాగా మనిషి ఆలోచించే గుణం కోల్పోతున్నాడు. ఈ కారణంగా మనిషి జ్ఞాపకశక్తి క్రమంగా నశిస్తోంది. ఏకాగ్రత లోపించడం, స్మార్ట్‌ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగించడం వల్ల యువతలో జ్ఞాపకశక్తి తగ్గుతోంది. ఒకప్పుడు వృద్ధుల్లో అల్జీమర్స్ ఉండేది. కానీ ఇప్పుడు 40 ఏళ్లలోపు వారిలోనూ ఈ సమస్య వేధిస్తోంది. బీపీ, షుగర్ వ్యాధి కారణంగా కూడా ఈ సమస్య అధికమవుతోంది. – డాక్టర్ బి. రమేష్‌బాబు, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

అల్జీమర్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



వృద్ధాప్యంలో వచ్చే అల్జీమర్స్ అటు వ్యక్తిగతంగా, ఇటు కుటుంబసభ్యులను ఇబ్బంది పెడుతుంది. వయస్సు మీదపడే కొద్దీ సమస్య ఎక్కువవుతుంది. దీనికి మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, పొగ తాగడం, మత్తుపానీయాలు సేవించడం, తలకు గాయాలు కావడం, జన్యుపరమైన మార్పులు, విటమిన్–బీ 12, విటమిన్–డి లోపం, థైరాయిడ్ సమస్యలు, నిద్రలేమి కూడా మతిమరుపునకు దోహదం చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచుకోవడం, వ్యాయామం, ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం, మెదడుకు వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లుతో ఈ సమస్యను అధిగమించవచ్చు. – డాక్టర్ కె. హేమంత్‌కుమార్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

క్లుప్తంగా

విద్యా బుద్ధులు ప్రసాదించు తల్లీ



చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న పండితుడు

కొత్తపల్లి: ఉత్తరాయణం జేష్ఠమాసం శుక్లపక్షం ఏకాదశి కావడంతో సోమవారం కొలనుభారతి అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి చేరుకొని అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 42 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. విద్యాబుద్ధులు ప్రసాదించు తల్లీ అని కొలనుభారతిదేవి అమ్మవారిని చిన్నారుల తల్లిదండ్రులు వేడుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు సలెంద్ర ఈశ్వర్

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ పరిధిలోని పెసలబండకు చెందిన సలెంద్ర వెంకటేశులు, పద్మావతమ్మ దంపతుల కుమారుడు ఈశ్వర్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈశ్వర్ సోమవారం ఉదయం ఆదోని-నగరూర్ ఆర్ఎస్ మధ్యలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సేద్యం చేస్తూ మృత్యు ఒడికి



మృతి చెందిన ఆంజనేయులు (ఫైల్)

పాములపాడు: మండల కేంద్రం పాములపాడులో ఓ వ్యవసాయ కూలీ పొలంలో సేద్యం చేస్తూ గుండెనొప్పితో కుప్పకూలి మృతి చెందాడు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు పొలంలో సేద్యం చేసేందుకు సోమవారం గొల్ల ఆంజనేయులు (59) వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం సేద్యం చేస్తుండగా గుండెనొప్పి రావడంతో ఎద్దులను నిలిపి పొలం గట్టుపై కుప్పకూలిపోయాడు. చుట్టు పక్కల వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గుర్తించి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

మహానందిలో చిరుతపులి



వివేకానంద పాఠశాల వద్ద చిరుతపులి పాదముద్ర

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిధిలోని అన్నప్రసాద వితరణ కేంద్రం, గోశాల, వివేకానంద పాఠశాల ప్రాంగణాల్లో సోమవారం రాత్రి మరోసారి చిరుతపులి సంచారం కలకలం రేపింది. తాజాగా సాయంత్రం గోశాల, అన్నప్రసాద కేంద్రం ప్రాంగణంలో పందిపిల్ల, కుక్కపై చిరుత పులి దాడి చేసింది. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు వివేకానంద పాఠశాల బావి వద్ద ఉన్న చిరుత పులిని కేకలు వేస్తూ అడవిలోకి పంపించారు. ఇదిలా ఉండగా మహానంది పుణ్యక్షేత్రం కావడంతో పాటు స్థానికులు సంచరిస్తుండటంతో ఎప్పుడు, ఎలాంటి హాని జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెలికాం నగర్‌లో గొలుసు దొంగల హల్‌చల్

- వివాహిత మెడలో మూడు తులాల గొలుసు చోరీ

కర్నూలు: కర్నూలు శివారు నంద్యాల రోడ్డులోని టెలికాం నగర్‌లో చైన్ స్నాచర్స్ పట్టపగలే హల్‌చల్ చేశారు. అదే కాలనీలో నివాసముంటున్న సుబ్బరాజు భార్య వరలక్ష్మమ్మ(55) దుకాణం నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బజాజ్ సీటీ 100పై సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆమెను సమీపించి మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. ఆమె అప్రమత్తమై దొంగ.. దొంగ అని అరిచేలోగా మోటర్‌సైకిల్ వేగం పెంచి పక్క సందు మీదుగా కనిపించకుండా పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూడవ పట్టణ ఎస్ఐ సురేష్, మన్మథ విజయ్‌తో పాటు క్రైం పార్టీ సిబ్బంది నేర స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. చోరీ జరిగిన తీరును బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. ఓ సీసీ కెమెరా పుటేజీలో ఇద్దరు యువకులు ఆమెను సమీపించినట్లు గుర్తించారు. కర్నూలుకు చెందిన యువకులే ఈ నేరానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

బాలిక అదృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరుకు చెందిన ఓ బాలిక అదృ శ్యమైనట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం బాలిక ఎవరో మోటార్ సైకిల్‌పై వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు చుట్టు పక్కల బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారని ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేష్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన బోస్లే చంద్రశేఖర్‌రావు అతని తమ్ముడి జ్ఞాపకార్థం లేట్ బోస్లే యుగంధర్ రావు పేరిట రూ.1,00,011 నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు వివరించారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందించి, ఆశీర్వాదాలు కల్పించి బాండు, ఫొటోను అందజేసి పూలమాలతో సత్కరించారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేష్ కోరారు.

అద్దె భవనం లభించిన వెంటనే హాస్టళ్లలో వసతి

- విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- డీబీసీడబ్ల్యూఓ పీ వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న బీసీ, డీఎస్‌టీ బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకట లక్ష్మమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ వసతి గృహాలను నిర్వహిస్తున్న భవనాలు పూర్తి శిథిలావస్థకు చేరడంతో జిల్లా కలెక్టర్ అనుమతితో వీటిని తాత్కాలికంగా మూసివేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ రెండు వసతి గృహాల్లో 130 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారన్నారు. వీరిని విద్యార్థులు, తల్లిదండ్రుల అనుమతితో జిల్లాలోని పెద్దపాడు, లొద్దిపల్లె, అమ్మడగుంట్ల, లద్దగిరి బీసీ బాలుర వసతి గృహాల్లో ప్రవేశం కల్పించనున్నామన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మూసివేతకు గురైన హాస్టళ్లను పునఃప్రారంభించేందుకు అనువైన అద్దె భవనం కోసం అన్వేషిస్తున్నామన్నారు. అద్దె భవనం లభించిన వెంటనే ఆయా హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులను తిరిగి కర్నూలుకు రప్పిస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో టీసీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లా కలెక్టర్ ద్వారా జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించి చర్యలు చేపడతామన్నారు.

నెరణికి తండాలో అతిసారం

- వృద్ధురాలి మృతి



మృతి చెందిన చంద్రికబాయి

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండా గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలింది. బాధితులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆలూరు, ఆదోని తదితర పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన చంద్రికాబాయి (60) అనే వృద్ధురాలు సోమవారం అతిసారం లక్షణాలతో మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి విరుపాపురం మంచినీటి పథకం నుంచి సరఫరా చేసే ఎల్లెల్సీ నీరు కలుషితం కావడం వల్లే అతిసార వ్యాధి ప్రబలినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దుర్వాసన వస్తున్న నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. అధికారులకు అనేక సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామంలో అతిసారం ప్రబలడంతో నాలుగు రోజులుగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్య సేవలు అందిస్తున్నట్లు హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్ న్యూటన్ సోమవారం తెలిపారు. చంద్రికబాయ్ అనే వృద్ధురాలు మృతికి అతిసారం కాదని ఆయన చెప్పారు. అనారోగ్యంగా ఉన్న వారికి మందుల పంపిణీ చేశామన్నారు. గ్రామానికి సరఫరా అయ్యే నీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు ఆయన వెల్లడించారు. అలాగే నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఎంపీడీఓ, స్థానిక పంచాయతీ అధికారులకు సూచించామన్నారు.



గ్రామస్తుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

మంత్రాలయం: మంత్రాలయం మండల పరిధిలోని చౌటుపల్లి గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు కుమారుడు వరుణ్ అనే బాలుడికి విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో విద్యుత్ తీగ మెయిన్ లైన్ స్తంభం నుంచి కిందకు వేలాడుతోంది. సోమవారం బాలుడు గమనించకుండా విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. బాలుడి కుడి చెయ్యికి తీవ్ర గాయం కావడంతో ఆదోనిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. విద్యుత్ తీగ కిందకు వేలాడుతుందని లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోలేదని, లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే ఇప్పడు తమ కుమారుడికి విద్యుదాఘాతానికి గురై గాయాల పాలయ్యాడని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నట్లు తెలిపారు.

కిక్ కొడితే పతకాలే!

- మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న చిచ్చర పిడుగులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు కైవసం
- నగరంలో తైక్వాండోకు మంచి ఆదరణ



తైక్వాండో క్రీడలో సాధన చేస్తున్న క్రీడాకారులు



కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్ క్రీడ తైక్వాండోకు మంచి ఆదరణ ఉంది. యుద్ధ క్రీడగా పేరొందిన ఈ క్రీడలో కర్నూలు నగరానికి చెందిన ఎంతో మంది చిన్నారులు రాణిస్తున్నారు. గుర్తింపు క్రీడ కావడంతో పిల్లలు మరింత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. తైక్వాండోకు కేరాఫ్‌గా కర్నూలు నగరం మారుతోంది. ఇక్కడి క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణిస్తుండటం శుభ పరిణామం. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో తైక్వాండో కోచ్ అందుబాటులో ఉండటం కూడా ఈ క్రీడ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. కఠోరమైన సాధన చేయాల్సిన ఈ క్రీడల్లోను బాలికల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండటం విశేషం. తల్లిదండ్రులు సైతం ఇటువంటి క్రీడల వైపు తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. ఆత్మరక్షణ, మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, శారీరక ధృడత్వం కలిగిన ఈ క్రీడల్లో కర్నూలు నగరానికి చెందిన ఎంతో మంది చిన్నారులు మంచి ప్రతిభ చూపుతున్నారు. కొంత మంది శిక్షకులు నామమాత్రంగా ఫీజు తీసుకొని ఉత్తమ శిక్షణ అందిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవి కాలం సెలవుల్లో నగరంలోని అనేక కేంద్రాల్లో ఉచితంగా ఈ క్రీడను నేర్పిస్తున్నారు. ఎంతో మంది క్రీడాకారులు కర్నూలు నుంచి ప్రాతినిధ్యం వహించి పతకాలు కైవసం చేసుకున్నారు.

సాధన ఎంతో అవసరం



తైక్వాండో క్రీడల్లో రాణించాలంటే సాధన ఎంతో అవసరం. నేను 8వ తరగతి చదువుతున్నా. 2022లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని బంగారు పతకం సాధించాను. 2023లో జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాను. విశాఖపట్నం జిల్లా ఎలమంచిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించాను. – వీసీ మోహన్‌కుమార్

12 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా



చిన్నారులు తైక్వాండో పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కఠోర శిక్షణ ఉన్నా తల్లిదండ్రులు తమ పిల్లలను మార్షల్ ఆర్ట్స్ క్రీడ తైక్వాండో శిక్షణకు పంపిస్తున్నారు. గుర్తింపు క్రీడ కావడంతో భవిష్యత్తుల్లో సర్టిఫికెట్లు చదువు, ఉద్యోగాల్లో ఉపయోగపడతాయి. నా 12 ఏళ్ల శిక్షణలో ఎంతో మంది పతకాలు సాధించి పేరు తెచ్చుకున్నారు. ఏపీఎస్‌పీ క్యాంపు, కిడ్స్ వరల్డ్ పార్కు, టౌన్ మోడల్ పాఠశాలలో ప్రతి రోజు శిక్షణ అందిస్తున్నా. జాతీయ స్థాయిలో పోటీ పడే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నాం. – సతీష్, కోచ్

జాతీయ స్థాయిలో రాణిస్తా



నేను ఇంటర్మీడియెట్ ఎంపీసీ చదువుతున్నా. 2022లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడవ స్థానంలో నిలిచాను. 2023లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండవ స్థానం నిలిచాను. అమ్మ మహేశ్వరి, నాన్న సాయిబాబా ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో రాణించడమే నా ఆశయం. – టీఎం. గాయత్రీ

బంగారు పతకం సాధించా



2022లో జిల్లా స్థాయి తైక్వాండోలో బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాను. విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించాను. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యా. రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాను. – టీఎం. ఉమ

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న నేను స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా తైక్వాండో పోటీల్లో నిరంతరం సాధన చేస్తున్నాను. 2022లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. 2023లో ఎస్‌జిఎఫ్ క్రీడల్లో జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించాను. జాతీయ స్థాయిలో రాణించేలా నిరంతరం సాధన చేస్తున్నాను. – పి. హర్షిత్ బెన్నీ